సాక్షి
సిద్దిపేట
శనివారం, 11, మే, 2024



సభకు హాజరైన జనం



బహూకరించిన గొంగళితో కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

జనం హోరు.. గులాబీ జోరు

కేసీఆర్ రాకతో పురిటిగడ్డ పులకింత

- అడుగడుగునా బీఆర్ఎస్ అధినేతకు స్వాగతం
- దారిపొడవునా నీరాజనాలు
- గులాబీమయమైన సిద్దిపేట

సిద్దిపేటజోన్/సిద్దిపేటకమాన్: తెలంగాణ ఉద్యమ సారథి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాకతో సిద్దిపేట పురిటి గడ్డ పులకించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర ముగింపు సభ శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో అట్టహాసంగా కొనసాగింది. సిరిసిల్ల పర్యటన ముగించుకుని రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ముస్తాబాద్ చౌరస్తా నుంచి రోడ్డు షో ప్రారంభమైంది. దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా పార్టీ శ్రేణులు, ప్రజలు బారులు తీరి కేసీఆర్ బస్సు యాత్రకు స్వాగతం పలికారు. బస్సులో నుంచి ఇరు వైపులా ప్రజలకు చేతులు జోడించి నమస్కరిస్తూ విక్టరీ సంకేతాన్ని చూపుతూ ముందుకు సాగారు. సుమారు 45 నిమిషాల పాటు మెదక్ రోడ్డు గుండా సాగిన రోడ్డు షో బస్సు ముందు కళాకారుల నృత్యాలు, తెలంగాణ బతుకమ్మ బోనాలు, మహిళల కోలాటాలు, డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. ముస్తాబాద్ చౌరస్తా నుంచి కొనసాగిన బస్సు యాత్ర ఈద్గా, కాంచీట్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా, ఉమా భవన్ చౌరస్తా మీదుగా పాత బస్టాండ్ వరకు చేరుకుంది. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో కేసీఆర్ బస్సు పై నుంచి ప్రజలను ఉద్దేశించి సుమారు 11 నిమిషాల పాటు ప్రసంగించారు. ముస్తాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు కొనసాగిన బస్సు యాత్రకు పార్టీ నాయకులు, శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మంగళ హారతులతో స్వాగతాలు, పూల వర్షాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు.

గుండె నిండా సంబురమని..

మిమ్మల్ని అందరినీ ఇక్కడ చూస్తుంటే కడుపు నిండా సంబురంగా ఉందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిద్దిపేటతో ఉన్న ఆత్మీయతను ప్రజలతో పంచుకున్నారు. కార్నర్ మీటింగ్ సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ప్రజలను ఉద్దేశించి ఉద్వేగ పూరితమైన ప్రసంగం చేశారు. మాట్లాడిన పది నిమిషాల సమయం ఆద్యాంతం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైఖరిని ఎండగట్టారు. సిద్దిపేటను హరీశ్ రావు ఎంతో అభివృద్ధి చేశారని, కొత్త జిల్లా కలెక్టర్‌గా వెంకట్రాంరెడ్డి పనితీరు బావుందని, ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే ఇద్దరు కలిసి సిద్దిపేటను మరింత ముందుకు తీసుకు వెళతారని అన్నారు. కేసీఆర్ వెంట ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



బోనాలతో కోలాటం ఆడుతున్న మహిళలు



డ్రమ్స్ వాయిస్తూ.. నృత్యం చేస్తూ..



మీటింగ్‌కు హాజరైన పెద్దలింగారెడ్డిపల్లి యువత



కళాకారుల విన్యాసం



కార్యకర్త ఉత్సాహం

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- నిర్భయంగా ఓటేయండి
- మంత్రి కొండా సురేఖ

సిద్దిపేటఅర్బన్: ప్రజలు నిర్భయంగా ఓటేయాలని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో శుక్రవారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజల బతుకులు బాగుపడతాయని అన్నారు. అందరికీ న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ప్రతి పక్ష పార్టీలు చెప్పే మాటలు నమ్మొద్దని, ఇందిరాగాంధీ ఎంపీగా ఉన్నప్పుడు మెదక్ ప్రాంతంలో అనేక పరిశ్రమలు నెలకొల్పి అనేక మందికి ఉపాధి కల్పించారని అన్నారు. ఎన్నికల సమయంలో ఏజెంట్లను, కార్యకర్తలను, ప్రజలను భయపెట్టినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. సిద్దిపేట ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని, ఎవరికీ భయపడకుండా ఓటు వేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా రోడ్ షో నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల బిడ్డ అయిన నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి నీలం మధు, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీలంను గెలిపిద్దాం

సిద్దిపేటకమాన్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు న్యాయవాదులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీసీ బిడ్డ మధును ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. నిత్యం అందుబాటులో ఉండే నీలంను గెలిపిద్దామని అన్నారు. కార్యక్రమంలో నీలం మధు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో అభ్యర్థి నీలం మధు తదితరులు

అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు

నంగునూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే కేసీఆర్ ఎంపీలను బీజేపీకి అమ్ముకుంటారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా శుక్రవారం నంగునూరులో నిర్వహించిన రోడ్‌షోలో కొండా సురేఖ పాల్గొని మాట్లాడారు. ఇన్నాళ్లు స్వేచ్ఛ కోల్పోయిన సిద్దిపేట ప్రజలకు త్వరలో స్వాతంత్ర్యం రాబోతుందన్నారు. ఎన్నికలు ముగియగానే ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఇళ్లు, రేషన్‌కార్డుల తోపాటు ఆరు గ్యారంటీ పథకాలను అందజేస్తామన్నారు. అభ్యర్థి నీలం మధు మాట్లాడుతూ సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే కొందరే బాగుపడ్డారని, ప్రజల కష్టాలు మాత్రం తీరలేదన్నారు. కార్యక్రమంలో దేవులపల్లి యాదగిరి, శంకర్, సిద్దిపేట ఇన్‌చార్జి హరికృష్ణ, నితీన్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు ఏమాయె?

- రివర్స్ గేరులో కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యే హరీశ్‌రావు

హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ గెలిస్తే హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజీ పెడతామని ప్రియాంకగాంధీ చెప్పారన్నారు. కాంగ్రెస్ నాయకులు మార్పు తెస్తామంటే ప్రజలు నమ్మి మోసపోయారని అన్నారు. పేద ప్రజలకు కేసీఆర్ అండగా ఉండి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని రాజేశ్వరస్వామి గుడిలో రాసి ఇచ్చిన బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి వచ్చే దేవాదుల నీళ్లు బంద్ అయినా మంత్రి పొన్నం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు, ఆరు గ్యారంటీలను విస్మరించినందుకు ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

బీజేపీని బొందపెడితేనే దేశం అభివృద్ధి

- ఆరు గ్యారంటీలపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: తెలంగాణ విభజన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని, బీజేపీని బొందపెడితేనే దేశం అభివృద్ధి చెందుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లో శుక్రవారం రాత్రి ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా జరిగిన రోడ్ షోలో పాల్గొని మాట్లాడారు. 70 ఏళ్ల చరిత్రను తిరగరాసిన చరిత్ర హుస్నాబాద్ ప్రజలదని అన్నారు. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తీసివేస్తారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఆరు గ్యారంటీలపై మాట్లాడే హక్కు లేదన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, రుణ మాఫీ చేస్తామన్నారు. రైతు భరోసా ఇస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఆపారన్నారు. హుస్నాబాద్‌ను రాబోయే కాలంలో బంధ విముక్తం చేసే భాద్యత నాది అని అన్నారు. త్వరలోనే కరీంనగర్ కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ రోడ్డును నాలుగు లేన్ల అభివృద్ధి చేస్తామన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

బీఆర్ఎస్, బీజేపీలకు అవకాశం ఇచ్చారని, ఈ సారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు కోరారు. ఎంపీ బండి సంజయ్ నయా పైసా తేలేదని ఆరోపించారు. అభివృద్ధిని విస్మరించారన్నారు. ఎంపీగా గెలిపిస్తే పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో కరీంనగర్‌ను కోహినూర్ కరీంనగర్‌గా చేస్తామని రాజేందర్ తెలిపారు. వెలిచాల రాజేందర్‌రావుకు హుస్నాబాద్ నుంచి 40 వేల మేజార్టీ ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సీపీఐ కార్యదర్శి మర్రి వెంకట స్వామి, కాంగ్రెస్ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం

కోహెడలో పొన్నం ప్రచారం

కోహెడ(హుస్నాబాద్): మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం కోహెడలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ ఆవరణలో చిరు వ్యాపారులతో ముచ్చటించారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు పక్కన ఉన్న బండి వద్ద చాయ్ తాగారు. పార్టీ కార్యాలయంలో మంత్రి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు.

రెండో రోజు పరీక్షకు 157 మంది హాజరు

సిద్దిపేటఅర్బన్: పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించి ఎంసెట్ పరీక్షకు రెండవ రోజు 157 మంది హాజరయ్యారు. సీబీటీ విధానంలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన సెషన్‌కు 80 మందికి గాను 78 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌కు 80 మందికి గాను 79 మంది హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ మాధురి, టీసీఎస్ కుమార్, పీఆర్వో రఘు పర్యవేక్షించారు.



పరీక్ష కేంద్రం వద్ద క్యూలైన్‌లో వెళ్తున్న విద్యార్థులు

పటిష్ట బందోబస్తు

- సిద్దిపేట సీపీ అనురాధ



సిద్దిపేటకమాన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగంతో కలిసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలోని అధికారులు, సిబ్బంది, మహిళా సిబ్బంది, సాయుధ బలగాలు, ట్రైనింగ్ కానిస్టేబుళ్లు, స్పెషల్ ఫోర్స్, ఆర్టీసీ సిబ్బంది, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, కేంద్ర బలగాలతో కలిపి మొత్తం 2,482 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 11 ఉదయం 5 నుంచి ఈ నెల 14వ తేదీ ఉదయం 5 గంటల వరకు 144 సెక్షన్ నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. జిల్లాలో 11 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. 26 మోడల్ కోడ్ కండక్ట్ టీమ్స్, 12 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు రాజకీయ ఉద్దేశ్యంతో కూడిన మెసేజ్‌లు పంపకూడదని తెలిపారు.

ప్రగతిపై ప్రణాళిక లేని బీజేపీ

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

జహీరాబాద్: అభివృద్ధిపై సరైన ప్రణాళిక లేకుండా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం విమర్శించారు. శుక్రవారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల మధ్య మత విద్వేషాలను పెంచి లబ్ధిపొందే ప్రయత్నం చేస్తుందన్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాల వల్ల దేశంలో విపరీతమైన అసమానతలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలతో పేదలపై పెను భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పన్నుల రూపంలో రూ.58 లక్షల కోట్లను వసూలు చేస్తోందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే విషయంలో విఫలమైందన్నారు. కార్పొరేట్ రంగాలకు లబ్ధి చేకూరేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. దీంతో అదాని ఆస్తి రూ.25వేల కోట్ల నుంచి రూ.7లక్షల కోట్లకు పైగా చేరిందని, అంబాని ఆస్తి రూ.1.50లక్షల కోట్ల నుంచి రూ.7.50లక్షల కోట్లకు పెరిగిందన్నారు.



మాట్లాడుతున్న కోదండరాం

జహంగీర్‌ను గెలిపించండి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య

కొమురవెల్లి(సిద్దిపేట): భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య అన్నారు. శుక్రవారం మండల కమిటీతో కలిసి మండలంలోని రసులాబాద్, అయినాపూర్, తపాస్‌పల్లి, గౌరయపల్లి గ్రామాల్లో జహంగీర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల అసమర్థత వల్లే గ్రామాలు వెనుకబడి ఉన్నాయని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడూ అభివృద్ధి చేయని నాయకులు మళ్లీ గెలిస్తే అభివృద్ధి ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, రవీందర్, శారద పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అభ్యుదయవాది బసవేశ్వరుడు



బసవేశ్వరుడి జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమాజంలో నెలకొన్న అసమానతలను వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బసవేశ్వర జయంతిని కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరై బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువత బసవేశ్వరుడి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బసవేశ్వరుడిని విశ్వ గురుగా పిలుస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్య, సెట్విన్ అధికారి అమీనా భాను, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతపై అలసత్వం వద్దు

- అదనపు డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సిద్దిపేట అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన అధికారులు, సిబ్బందికి విధుల గురించి సీపీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో ఎదైనా సమస్య ఉంటే సంబంధిత మొబైల్ పార్టీలకు తెలపాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించకూడదన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈవీఎంలను సురక్షితంగా కాపాడటంలో పోలీసుల ముఖ్య బాధ్యత అన్నారు. సమావేశంలో ఎన్నికల సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరవింద్‌కు దక్షిణాఫ్రికా ఆహ్వానం



సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు అరవింద్‌కు దక్షిణాఫ్రికా మెడికల్ యూనివర్సిటీ నుంచి ఆహ్వానం అందింది. గత ఏడాది డెంటిస్ట్ ఫైనల్ పరీక్షల నిర్వహణకు ఎగ్జామినర్‌గా వ్యవహరించిన డాక్టర్ అరవింద్‌కు మళ్లీ అవకాశం లభించింది. ఈమేరకు రువాండా మెడికల్ సైన్సు యూనివర్సిటీ ప్రతినిధులు ఆహ్వానం పంపించారు. మన దేశం నుంచి ఒక్కరికే అవకాశం దక్కడంతో ఎమ్మెల్యే హరీశ్ రావు అరవింద్‌ను అభినందించారు.

ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

మిరుదొడ్డి(దుబ్బాక): ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సీకరిస్తున్నట్లు తెలంగాణ మోడల్ స్కూల్/కళాశాల ప్రిన్సిపాల్ భారతీ దేవీ తెలిపారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఆమె మాట్లాడుతూ ఈనెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల లిస్టును 27న నోటీసు బోర్డుపై పొందు పరుస్తామన్నారు. జూన్ ఒకటి నుంచి విద్యా బోధన ప్రారంభమవుతుందని తెలిపారు.

బస్తీ దవాఖాన సేవలు వినియోగించుకోండి



బస్తీ దవాఖానలో వైద్య పరికరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: బస్తీ దవాఖానాల్లో అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట ఇందిరమ్మ కాలనీలోని బస్తీ దవాఖానను డీఎంహెచ్‌ఓ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు, పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తారన్నారు. ఓపీ సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వినోద్‌బాబ్జి, డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోవాలి
ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఓటు అత్యంత శక్తివంతమైనదని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ అన్నారు. కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కే మూలమన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సీతారాములు, డాక్టర్ సామ సువర్ణాదేవిలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ స్రవంతి, హరితహారం ఇన్‌చార్జి స్వప్న, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ వేసవి శిక్షణ

సిద్దిపేటఎడ్యుకేషన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతోందని సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేట స్పోర్ట్స్ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత కబడ్డీ కోచింగ్ శిబిరాన్ని ప్రారంభించారు. కోచ్ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 5.30గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. వివరాలకు 7013 246847 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి నగేశ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి అశోక్, అధ్యాపకులు ప్రసాద్, ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ మహేశ్, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

భువనగిరి కోటపై సీపీఎం జెండా
పార్టీ మండల కార్యదర్శి యాదగిరి

మద్దూరు(హుస్నాబాద్): సీపీఎం భువనగిరి ఎంపీ గా జహంగీర్ విజయం ఖాయమని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అన్నారు. శుక్రవారం జహంగీర్‌కు మద్దతుగా నర్సాయిపల్లి గ్రామంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు తాటికొండ రవి, మండల కమిటీ సభ్యులు మల్లారెడ్డి, ప్రశాంత్, నర్సయ్య, పరుశరాములు, పోచయ్య, మల్లయ్య, రమేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రూ.75వేలు సీజ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీలో రూ.75వేల నగదును పట్టుకున్నారు. ఎస్సై వివేక్ తెలిపిన ప్రకారం.. వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో సయ్యద్ సల్మాన్ వాహనంలో ఆధారాలు లేకుండా నగదు ఉండడంతో సీజ్ చేశామన్నారు.

మొక్కలను రక్షించండి
మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

సిద్దిపేటజోన్: హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హరిత శుక్రవారంలో భాగంగా ఆమె మొక్కలకు నీరు పట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇండ్ల వద్ద ఉండే మొక్కలకు ప్రతీ శుక్రవారం స్వచ్ఛందంగా నీరు పట్టే ప్రక్రియ చేపట్టాలని సూచించారు.

కనీస వేతనం చెల్లించండి

వర్గల్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం శ్రమ దోపిడీ చేస్తోందని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని మైలారం, చౌదరిపల్లి, తదితర గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల కనీస వేతనం రూ.300కు పెంచినప్పటికీ క్షేత్రస్థాయిలో రూ.150 దాటడం లేదని, గడ్డపార, పారలను ఇవ్వడం లేదని కూలీలు వాపోతున్నారన్నారు. ఇంటర్నెట్ సరిగా లేని గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ హాజరు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఆన్లైన్ హాజరు రద్దు చేసి రూ.300 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఆపన్న 'హస్తం'

● కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం ● మంత్రి కొండా సురేఖ


కొండపాక: కాంగ్రెస్‌లో చేరుతున్న జప్తినాచారం బీఆర్ఎస్ నాయకులు

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్ పార్టీ పేదలకు ఆపన్న హస్తం అందిస్తుందని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఆమె సిద్దిపేట నియోజకవర్గంలోని గుర్రాలగొందిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జప్తినాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కర్ణాకర్, సాయిగౌడ్, రాజు, సంజీవ్, సుభాశ్, భాను, మహేశ్, లక్ష్మణ్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, నాయకులు పర్శరాంలు, భానుచందు, నర్సింలు, కిషన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల పాలనలో అభివృద్ధి ఏది?

సిద్దిపేటరూరల్: పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసి అభివృద్ధి చేశారో చూపించాలని సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం రూరల్ మండల పరిధిలోని పుల్లూరు, నారాయణరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కొండా సురేఖ హాజరై మాట్లాడుతూ.. నీలం మధు వార్డు మెంబర్ స్థాయి నుంచి అందరి మన్ననలు పొందుతూ, సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ స్థాయికి వచ్చారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15 లోపు రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీని అమలు చేయనున్నారని, సవాల్ విసిరిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రాజీనామా లేఖను సిద్ధం చేసుకోవాలన్నారు. చింతమడక గ్రామానికి చిల్లు పడిందని రాబోయే రోజుల్లో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. నీలం మధు ముదిరాజ్ ను భారీ మెజార్టీ తో గెలిపించాలన్నారు. అంతకుముందు నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. తనకు ఓటు వేస్తే కేంద్రం నుంచి, రాష్ట్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం చింతమడక గ్రామం మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, నారాయణరావుపేట మాజీ సర్పంచ్ రంగా గౌడ్ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా కండువా కప్పుకొని పార్టీలో చేరారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, మండల అధ్యక్షులు రాములు, బర్మా రామచంద్రం, కనకయ్య, కర్ణాకర్, బాబేశ్, రాజ్ వీర్, అత్తు ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సురేఖ అన్నారు. శుక్రవారం ఆమె పట్టణంలోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి నీలంమధు ముదిరాజ్, నాయకులున్నారు.

హస్తం గూటికి శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా సీనియర్ నాయకుడు ఏల శ్రీనివాస్‌రెడ్డి మంత్రి సురేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం ఆయనకు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, పీసీసీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విజయం కాంగ్రెస్‌దే

మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలంమధుముదిరాజ్ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని పీసీసీ అధికార ప్రతినిధి రామచంద్రం గౌడ్ అన్నారు. మధుకు మద్దతుగా జిల్లా కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సతీశ్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, అంజయ్య, జహీర్, సిద్ధిరాములు, భిక్షపతి, శంకర్, నర్సింగ్ యాదవ్, కుమార్, మల్లేశం యాదవ్, అభిద్, విజయ్, వెంగళ సుధీర్, అశోక్ పాల్గొన్నారు.

జోరుగా చేరికలు

కొండపాక(గజ్వేల్): ఐదు నెలల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని, మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండపాక, కుకునూరుపల్లి మండలంలోని కోనాయిపల్లి, మేదినీపూర్ కు చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. నర్సారెడ్డి, దేవేందర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగారావు, నాయకులు సురేందర్ రావు, మంచాల కనకరాంలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గోవర్ధనగిరి మాజీ సర్పంచ్

తొగుట(దుబ్బాక): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోవర్ధనగిరి మాజీ సర్పంచ్ తోయేటి ఎల్లం శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు రాజిరెడ్డి, రవీందర్, నర్సింలు గౌడ్, భూపాల్‌రెడ్డి, నిరంజన్, నరేందర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీసీ నేతను గెలిపిద్దాం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కష్టపడాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దౌలాపూర్, జగదేవ్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుణకర్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అజీజ్, పాషా, ఆంజనేయులుగౌడ్, రాజయ్య, శ్రీనివాస్, బంగారురెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అడ్రస్ గల్లంతు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్, బీజేపీల పథకాలకు ఆశపడితే గోసపడతామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కోశాధికారి వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. ఎంపీటీసీ సభ్యుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆధ్వర్యంలో లకుడారంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం శుక్రవారం బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రాజెక్టులు కోనసీమను తలపించాయన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టగానే అన్నదాతలు ఆగమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరుగ్యారంటీల అడ్రస్‌లేకుండా పోయాయన్నారు. బీజేపీ పాలనలో నిత్యావసర, చమురు, బంగారం ధరలు ఆకాశానంటుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, తాజా మాజీ సర్పంచ్‌లు కిరణ్ కుమార్‌చారి, మహిపాల్, నాయకులు మల్లేశం, ఐలయ్య, రాజు, లగిశెట్టి కనకయ్య, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


లకుడారంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ప్రభుత్వం మెడలు వంచుతాం

జెడ్పీటీసీ సభ్యురాలు మంగమ్మ

మర్కూక్(గజ్వేల్): కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి పనులు చేయిస్తామని జెడ్పీటీసీ మంగమ్మ, ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణ యాదవ్, బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు కనకయ్య అన్నారు. శుక్రవారం వారు గంగాపూర్, పాముల పర్తి, నర్సన్నపేట, మర్కూక్, దామరకుంట, ఎర్రవల్లి తదితర గ్రామాలలో వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, మాధవి రాజిరెడ్డి, నాయకులు పవన్ సింగ్, రాంచంద్రం, నర్సింలు, రాంసింగ్, రఘువీర్ సింగ్, జగదీశ్‌సింగ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


అక్కన్నపేట(హుస్నాబాద్): మల్లేశ్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సొంతగూటికి మాజీ సర్పంచ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మల్‌చెర్వుతండా మాజీ సర్పంచ్ భూక్య మల్లేశ్ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో సొంతగూటికి చేరారు. బీజేపీలోకి వెళ్లిన ఆయన పార్టీలో చేరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సాంబరాజు, నాయకులు రమేశ్, సత్యంనాయక్, రాజునాయక్, రంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు మిరుదొడ్డిలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజులు, ఎంపీటీసీలు నర్సింహులు, లక్ష్మి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లింగం, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌రాజు, నాయకులు గొల్ల రాములు, ధర్మారం బాబు, మల్లయ్య, నగేశ్, సుగుణ, రేణుక, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తప్పుడు ప్రచారాలకు తెరలేపే అవకాశాలున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్, రాష్ట్ర నాయకులు రాజమౌళి, కౌన్సిలర్లు యాదగిరి, శ్రీనివాస్,బత్తుల స్వామి అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తప్పుడు ప్రచారం చేసే ఉప ఎన్నికలో ఎమ్మెల్యే అయ్యారని ఆరోపించారు.

అయిలన్న గరం గరం చాయ్ ఇయ్యే..

మాజీ మంత్రి హరీశ్‌రావు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్ ముగించుకొని సిద్దిపేటకు వెళ్లే క్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు పట్టణ శివారులోని రోడ్డు పక్కన అయిలయ్య హోటల్‌లో ఆగి దంపతులతో ముచ్చటించారు. అయిలయ్యతో గరం చాయ్ చేయించుకొని తాగి కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. వీరి వెంట ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ఉన్నారు.


అయిలయ్యతో మాట్లాడుతున్న హరీశ్ రావు, వినోద్‌కుమార్

కిరణ్ గెలుపు.. దేశానికి మలుపు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): భువనగిరి ఎంపీగా అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు దేశానికే మలుపని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాసిందన్నారు. బీఆర్ఎస్ పార్టీపేరు మార్చినప్పుడే తెలంగాణ మీద అధికారం కోల్పోయిందన్నారు.


కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న రాజారెడ్డి తదితరులు

కార్యక్రమంలో సీపీఐ నాయకులు అశోక్, యాదగిరి, మమత, కనకయ్య, రమేష్, రాజు, శ్రీనివాస్, యాదయ్య, కిష్టయ్య, నాగరాజు, సురేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఓటుతో బీజేపీకి బుద్ధి చెబుదాం'

మిరుదొడ్డి(దుబ్బాక): బీజేపీని ఓడించి దేశాన్ని కాపాడుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ... 400 సీట్లు గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీని ఓటుతో ఎండగట్టాలన్నారు.

శంకర్‌కు పరామర్శ

మండల పరిధిలోని లింగుపల్లిలో పితృ వియోగంతో బాధ పడుతున్న దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్‌ను పబ్బతి శ్రీ కృష్ణ శుక్రవారం పరామర్శించారు. రాజయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపిద్దాం

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి

గజ్వేల్‌రూరల్: ప్రత్యేక రాష్ట్రంలో కులవృత్తులకు ప్రోత్సాహకాన్ని ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట వేశారని.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు అండగా నిలుద్దామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నాచారం దేవస్థాన ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లో నిర్వహించిన ముదిరాజ్ ముఖ్యనేతల సమావేశంలో వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిలవాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింలు, చంద్రం, ఆంజనేయులు, భాస్కర్, రమేశ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యాదగిరి

రిజర్వేషన్లపై దుష్ప్రచారం సరికాదు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమాదిగ

గజ్వేల్‌రూరల్: రిజర్వేషన్లపై కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం మానుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణమాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు మైస రాములుమాదిగలు అన్నారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేశ్, మహేష్, నరేందర్, రవి, కరుణాకర్, బీజేపీ నాయకులు మనోహర్‌యాదవ్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడు అభ్యుదయవాది

మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: సమాజంలో సమానత్వం కోసం విశేషంగా కృషి చేసిన బసవేశ్వరుడు అందరివాడని, కుల వ్యవస్థను, వర్ణబేధాలను, లింగ వివక్షతను వ్యతిరేకించి అందరిని సమానంగా చూసిన గొప్ప అభ్యుదయవాది బసవేశ్వరుడు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బసవేశ్వరుడి జయంతి సందర్భంగా శుక్రవారం పొన్నాల రాజీవ్ రహదారి వద్ద గల బసవేశ్వరుడి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, గౌరవ అధ్యక్షుడు శివప్ప, ఉపాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి వీరేశం, సహాయ కార్యదర్శి ప్రశాంత్, సలహాదారుడు శివకుమార్, కోశాధికారి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బసవేశ్వరుడి జయంతి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వీరశైవ అర్చకులు ఆలయ రాజగోపురం ఎదుట బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏఈఓ గంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వీరశైవ సంప్రదాయాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లిన మానవత వాది బసవేశ్వరుడన్నారు. ఆలయ ప్రధానార్చకులు మల్లికార్జున్, పి.మల్లయ్య పాల్గొన్నారు.


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గోపూజలో హరీశ్‌రావు

భక్తికి నిలయం సిద్దిపేట

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆలయాలకు, పూజలకు ప్రత్యేక నిలయంగా సిద్దిపేట నిలుస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసన్నాంజనేయ స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో 2వేల మంది హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదానం చేస్తున్నారు. ఈ భిక్షలో స్వాములతో కలిసి హరీశ్‌రావు భోజనం చేశారు.

వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ..

చేర్యాల(సిద్దిపేట): బసవేశ్వర జయంతిని వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో వీర శైవ లింగాయత్ సమాజ గౌరవ అధ్యక్షుడు నడిపుడి మఠం భవానయ్య మాట్లాడారు. అనంతరం 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాయితేజస్వి, సింధూజలను సన్మానించి షీల్డులు అందజేశారు. వీర శైవ లింగాయత్ సమాజం మండల అధ్యక్షుడు రాము, కంది ప్రసాద్, సంఘ ప్రతినిధులు సుబ్రమణ్యం, ఉమాపతి, మల్లేశం, సోమయ్య, వినోద్, రాజమౌళి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆలయ వార్షికోత్సవం**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలోని మండలేశ్వరాలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రాజపున్నయ్య శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైదిక నిర్వాహకులు చంద్రశేఖర శర్మ, రమేశ్, శర్మ, రజక సంఘం సభ్యులు దుర్గయ్య, శ్రీనివాస్, నర్సయ్య, అంజయ్య, రాము లు, బాలరాజు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **దాడి అమానుషం**

హుస్నాబాద్: ఏపీలోని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పై రాళ్ల దాడి చేయడం అమానుషమని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ హక్కుల కోసం పోరాడే వ్యక్తి కృష్ణయ్య పై ఎన్నికల ప్రచారంలో దుండగులు రాళ్లు విసరడం వల్ల వీపు భాగంలో గాయమైందన్నారు. వైసీపీ పార్టీ బీసీలకు సంబంధించి విద్య, వైద్యం, ఉద్యోగ కల్పనలో ఏపీలో ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ విషయంలో జగన్‌కు మద్దతుగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో రాళ్లు రువ్వడం, చెప్పులు విసరడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు భూమయ్య, కొమురయ్య, సాంబమూర్తి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్‌తోనే సమన్యాయం**

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి విజయం తథ్యమని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయనకు మద్దతుగా మద్దూరు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ మండల, గ్రామ అధ్యక్షుడు, సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్, సభ్యులు, ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేస్తే వృథా అవుతుందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అందరికీ సమన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, జెడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సాయిలు, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, పద్మారెడ్డి, బాలరాజు, శ్రీనివాస్, సురేశ్, సందేటి లక్ష్మి, తాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'**

దుబ్బాకటౌన్: హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శుక్రవారం దుబ్బాక పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళ నాయకులు యాదమ్మ, లత, సుగుణ, అనురాధ తదితరులున్నారు.

◆ **రిమ్మనగూడలో ఫ్లాగ్‌మార్చ్**

గజ్వేల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని రిమ్మనగూడలో అడిషనల్ సీఐ ముత్యంరాజు, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

◆ **వెలిచాలను గెలిపిద్దాం**

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మల్‌చెర్వుతండా గ్రామంలోని బీఆర్ఎస్, బీజేపీ నుంచి పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు.

బైక్ ర్యాలీ

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీని ఓడిద్దాం'

గజ్వేల్‌రూరల్: బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పి రాజ్యాంగాన్ని, కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని, మాయమాటలతో ప్రజలను మభ్య పెడుతున్న బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రంగారెడ్డి, స్వామి, నర్సింలు, కనకయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.